క్లుప్తంగా

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు, పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై గ్రామస్తులు, భక్తులకు స్వామివారి ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



గొల్లలదొడ్డిలో సాక్షులను విచారిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

సి.బెళగల్: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నేపథ్యంలో కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ శనివారం విచారణ నిర్వహించారు. సి.బెళగల్‌కు చెందిన బరకం మునిస్వామి, అతడి మిత్రుడిపై అదే గ్రామానికి చెందిన కొంతమంది పాతవివాదాల నేపథ్యంలో ఈ నెల 4న గొల్లలదొడ్డిలో దాడి చేసి కులం పేరుతో దూషించారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో, ఈనెల 9న పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ బాబు ప్రసాద్, స్థానిక ఎస్‌ఐ పరమేష్ నాయక్‌తో కలిసి ఘటనా స్థలికి వెళ్లి బాధితులైన మునిస్వామి, దాడిలో పాల్గొన్నవారు, సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు ఎరువులను అందజేస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులతో పాటు యూరియా అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. శనివారం కోడుమూరులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. మండలంలోని కోడుమూరు, అనుగొండ, అమడగుంట్ల, ఎర్రదొడ్డి, ముడుమలగుర్తి, ప్యాలకుర్తి, వర్కూరు, పులకుర్తి, లద్దగిరి, గోరంట్ల రైతు సేవా కేంద్రాలతో పాటు, ఎరువుల దుకాణాల్లోనూ ఎరువులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా బస్తాలు కూడా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఎరువులను పొందాలని ఏఓ సూచించారు. రైతు సేవా కేంద్రాల వీఏఏలు శాంతి, శ్రీలేఖ పాల్గొన్నారు.

ఉచితంగా టీబీ మందులు

గడివేముల: టీబీ మందులు ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదాబాయి తెలిపారు. శనివా రం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో ఉన్న జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వర్కర్స్ కాలనీల్లో కార్మికులకు వైద్య పరీక్షలు ని ర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భ ంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి టీబీ నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.గాలి ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులు తుమ్మి నా, దగ్గినా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. టీబీ లక్షణాలు ఉంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శరత్, విజయలక్ష్మి, తేజశ్వణి, కిరణ్‌కుమార్, డీపీపీఎం నాగార్జున, టీబీ సూపర్‌వైజర్ శివుడు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వీఏఏలు అందుబాటులో ఉండాలి

కల్లూరు: వీఏఏ/వీహెచ్ఏ, ఏఈఓ, ఎంపీఈఓలు రైతుసేవ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి సూచించారు. శనివారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవ కేంద్రాల్లో ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. కౌలు కార్డులు ఉన్న రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. పీఎం కిసాన్ ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ కాని రైతులకు త్వరగా చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న హయాంలో మహిళలకు పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- హుసేనాపురంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం
- ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ఎత్తిచూపిన కాటసాని
- ప్రజల నుంచి విశేష ఆదరణ



చంద్రబాబు ఏడాది పాలనలో పొందిన లబ్ధిపై మహిళను ఆరాతీస్తున్న కాటసాని

ఓర్వకల్లు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మహిళలకు పెద్దపీట వేసినట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. స్థానిక మసీద్ నుంచి కురువ గేరి, కాపగేరి, ఎస్సీ కాలనీ వరకు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంభూపాల్‌రెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇక్క సంక్షేమ పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. దాడులు, దౌర్జన్యాలు, రాజకీయ హత్యలకు పాల్పడుతూ, దుర్మార్గమైన పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి ఓట్లేయించేకుని అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. సామాజిక పింఛన్లు మినహాస్తే సూపర్ సిక్స్ పథకాల్లో అన్నింటికీ ఎగనామం పెట్టారన్నారు.

పథకాలను కాపీకొట్టిన బాబు..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను చంద్రబాబు నాయుడు కాపీ కొట్టి పేర్లు మార్చారని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. అమ్మఒడిని తల్లికి వందనం చేశారని, రైతు భరోసాను పెట్టుబడి సాయం అంటూ రైతన్నలను మోసం చేశారని అన్నారు. తొలి అడుగు పేరుతో గ్రామాలకు వచ్చే కూటమి నేతలను చంద్రబాబు మోసాలపై ప్రతిఒక్కరూ నిలదీయాలన్నారు. భవిష్యత్‌లో మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. అనంతరం చంద్రబాబు చేసిన మోసాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జికె వెంగన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగతిరుపాలు, గోపా వెంకటరమణారెడ్డి, రామేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గుర్రాల చెన్నారెడ్డి, శకునాల పుల్లారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పాలకొలను రమేష్, న్యామతుల్ల, కొమరోలు నాగేషులు, గుట్టపాడు సుంకిరెడ్డి, యువరాజు, మాజీ సర్పంచు చిన్నఅయ్యన్న, రంగడు, గోవిందు, కురువ రామకృష్ణ, కాల్వ వెంకటేశ్వర్లు, రసూల్ పాల్గొన్నారు.

22న మహిళా రక్షణ, హక్కులపై సదస్సు

కర్నూలు (న్యూటౌన్):మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22న మహిళా రక్షణ, హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి పి నిర్మల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దూపాడులోని అశోక ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగనున్న సదస్సుకు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ హాజరుకానున్నారన్నారు.

గడివేములలో భారీ వర్షం



భారీ వర్షంతో జలమయమైన రోడ్డు

గడివేముల: మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని రోజుల నుంచి వర్షం పడకపోవడంతో ఎదురుచూసిన రైతన్నలకు వర్షం కాస్త ఊరట నిచ్చింది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్

సి.బెళగల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు రాకుండా ఉండి ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని కర్నూలు జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి పేర్కొన్నారు. శనివారం సి.బెళగల్ మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో డీఈఓ భాస్కర్, ఇతర మండల అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామంలో డెంగీ అనుమానిత కేసు నమోదు కావడంతో జిల్లా అధికారులు అక్కడికి చేరుకుని ప్రజలకు, ఉద్యోగులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిత్యం చేపట్టాలని, మండల అధికారులు వాటి అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు. ముడుమాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలతో పాటు మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నియంత్రణ కోసం అవగాహన కల్పించాలని, ప్రజలు దోమకాటు నుంచి తప్పించుకోవడానికి దోమతెరలను వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైద్య సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సైపుల్లాభేగ్, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అహిర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలి



కలశ యాత్రకు స్వాగతం పలుకుతున్న యాదవులు

పాణ్యం: భారతదేశ సైన్యంలో యాదవులు సేవలందించేందుకు అహిర్(యాదవ) రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి, రాయలసీమ జిల్లా కన్వీనర్ శేషఫని యాదవ్, పచ్చిక బయళ్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సీఎంఆర్ యాదవ్ డిమాండ్ చేశారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన రెజాంగ్ లా కలశ యాత్ర శనివారం పాణ్యం చేరుకోవడంతో యాదవులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెజాంగ్ లా ప్రాంతంలో జరిగిన భారత్–చైనా యుద్ధంలో దాదాపు 114 మంది యాదవ సైనికులు 5 వేల మంది చైనా సైనికులతో తలపడి 1,310 మందిని హతమార్చారన్నారు. యాదవ సైనికుల ధైర్య సాహసాలను ప్రభుత్వం గుర్తించి అప్పట్లో అహిర్ రెజిమెంట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. తదనంతరం కాలంలో కేంద్ర ప్రభుత్వం దానిని రద్దు చేసిందన్నారు. రెజిమెంట్‌ను పునఃరుద్ధరించాలని కోరుతూ చేపట్టిన కలశ యాత్ర నవంబర్ 18న ఢిల్లీకి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు శివక్రిష్ణయాదవ్, శ్రీనివాసులు, సుబ్బక్రిష్ణ, సుబ్బయ్య, సునీల్, నాగమల్లేశ్వరి, శంకర్, బాలస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

సి.బెళగల్: గ్రామాల్లో పొదుపు సంఘాల సమావేశాలను గ్రామైక్య సంఘాల (జీఐఎస్) అధ్యక్షులు ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సమావేశ విషయాలపై వీఓఏలతో చర్చించారు. అనంతరం పొదుపు నిధుల వినియోగం, నగదు జమ, బ్యాంక్ రుణాలపై మాట్లాడారు. రుణాల రీషెడ్యూల్ అంశాలను జీఐఎస్ అధ్యక్షులు ఏపీఎం, సీసీలు తెలియజేశారు. ఈ సందర్భంగా నవధాన్యాల సాగుపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ షఫ్రుల్లా



కర్నూలు(హాస్పిటల్): డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ షఫ్రుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ సిరి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన కర్నూలు డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ స్పెషాలిటీ విభాగాలు అభ్యసించిన ఆయన మూడేళ్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఈఎన్‌టీ విభాగంలో, ఇటీవల మూడేళ్లు నంద్యాల డీసీహెచ్‌స్‌గా విధులు నిర్వహించారు.

బంగారు కుటుంబాల ఎంపికపై సమీక్ష



మాట్లాడుతున్న డీపీఓ లలితాబాయి

పాణ్యం: ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ–4 మార్గదర్శి బంగారు కుటుంబాల ఎంపికపై ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం డీపీఓ లలితాబాయి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులకు, మార్గదర్శులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీ–4 సర్వే చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 1,070 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వీరికి 50 మంది మార్గదర్శులను గుర్తించామన్నారు. ఒక్కో మార్గదర్శకుడు ఒకటి లేదా రెండు కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, ఈఓ ఆనందరావు పాల్గొన్నారు.

మాయమాటలతో మోసం చేయడం బాబు నైజం

- కూటమి పాలనలో స్కీంలు లేవు అన్నీ స్కాంలే
- అధికారం కోసం ఎన్నికల ముందు మాయమాటలు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ధ్వజం
- కర్నూలు ఎ.క్యాంప్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్



బాబు షూరిటీ–మోసం గ్యారెంటీపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సతీష్, పార్టీ నాయకులు

కర్నూలు (రూరల్): కూటమి పాలనలో స్కీములు లేవు, స్కాంలే మిగిలాయని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ఎద్దేవా చేశారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం కర్నూలు నగరంలోని ఏ.క్యాంప్ వద్ద వైఎస్సార్‌సీపీ కర్నూలు మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సతీష్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, మండల వైస్ ఎంపీపీ నెహెమ్య, 40వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు విక్రమ్ సింహారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని, ఆరోగ్యశ్రీ, సాగునీటి పథకాలు, తాగునీరు, రైతు భరోసా, అమ్మఒడి, నాడు–నేడు వంటి ఎన్నో పథకాలు అమలు చేశారని తెలిపారు. అయితే అబద్ధపు హామీలతో సీఎం అయిన చంద్రబాబు అన్నీ వర్గాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ వాళ్లకు మేలు చేస్తే పాముకు పాలు పోసినట్లే అని అనడం ఆయన ఎంత దుర్మార్గుడో ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు. దీపం' పథకంలో సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. 'తల్లికి వందనం' పథకంలో అనేక తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడాన్ని గుర్తు చేశారు. పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫలమైందని విమర్శించారు. ఈ విషయాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం దానికోసమే ప్రారంభించామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పంపిన బ్రోచర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాలు బహిర్గతమవుతాయని పేర్కొన్నారు. తమ నియోజకవర్గంలో కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని, రెండింతలు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ధైర్యంగా పోటీ చేసి తమ శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పెరపోగు మోహన్‌బాబు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు ఎం.కె. వెంకటేష్, వినయ్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ యాదవ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు డి. వాసు, మహేశ్వరరెడ్డి, తులసిరెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కల్లూరు: ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల కలిగే సమస్యలపై శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సల్కాపురంలో పోస్టర్లు ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు మాట్లాడుతూ సాధారణంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల పళ్లు పసుపు, గోధుమ రంగులోకి మారతాయన్నారు. కిడ్నీ వ్యాధులు, ఎముకలు, కీళ్ల నొప్పులు వస్తాయన్నారు. అనంతరం బాధితులకు మల్టీ విటమిన్, విటమిన్-సి మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సరళ, మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజం పట్ల నైతిక బాధ్యత అవసరం

పాణ్యం: ఇంజినీరింగ్ విద్యార్థులకు సమాజం పట్ల నైతిక బాధ్యత ఉండాలని రాష్ట్ర సాంకేతిక సలహాదారుడు కన్నయ్యనాయుడు సూచించారు. శనివారం నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యామ్‌లు, రిజర్వాయర్ల నిర్వహణ, భద్రత, సుస్థిరతలో నిర్మాణ ఇంజినీర్లదే కీలక బాధ్యత అన్నారు. చైర్మన్ శాంరాముడు, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు చేనేత కార్మికుల వినతి



కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రమిస్తున్న చేనేత కార్మికులు

కోడుమూరు రూరల్: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కోడుమూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు స్థానిక చేనేత కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి మాట్లాడుతూ.. చేనేత వృత్తిపై ఆధారపడి జిల్లాలో వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందడం లేదని వాపోయారు. కష్టపడి చీరలను నేసినా వాటికి మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి చేనేత కార్మికులకు సిల్క్ రాయితీ, 50 ఏళ్లు నిండిన కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఇండ్లు మంజూరు చేయాలని, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయాలని, ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచాలని, సొసైటీలకు ఎన్నికలు జరిపి 11రకాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, మహబూబ్‌బాషా, శంకర్, లోకనాథ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



కోడుమూరులో సిబ్బందితో కలిసి తిరుగుతున్న ఎస్‌ఐ ఎర్రిస్వామి

కోడుమూరు రూరల్: పట్టణంలోని రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి హెచ్చరించారు. శనివారం సాయంత్రం సిబ్బందితో కలిసి ప్రధాన రోడ్లపై కాలినడకన తిరుగుతూ ట్రాఫిక్ నిబంధనలపై దుకాణదారులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. రద్దీ సమయంలో వాహనదారులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. దుకాణదారులు, హోటళ్ల యజమానులు కూడా ఈ విషయాన్ని గమనించి వాహనాలను తమ దుకాణాల ముందు పార్కింగ్ చేయకుండా చూడాలని సూచించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నడపరాదన్నారు. అల్లరి మూకలు రోడ్లపై వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు సహించం

- డ్వామా పీడీ వెంకటరమణయ్య



సామాజిక తనిఖీ ప్రజావేదికలో తిమ్మందొడ్డి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ వెంకటరమణయ్య

సి.బెళగల్: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరమణయ్య హెచ్చరించారు. సి.బెళగల్ మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు ఉపాధిహామీ, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపట్టిన 1069 పనులకు ఖర్చు చేసిన రూ.15.23 కోట్ల పనుల 18వ సామాజిక తనిఖీలపై శనివారం అధికారులు ప్రజా వేదిక బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ.. ప్రజలు, గ్రామాలకు ఉపయోగపడే పనులను మాత్రమే చేయాలని స్పష్టం చేశారు. పనుల నిర్వహణపై సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తప్పులకు తావులేకుండా చూసుకోవాలని సూచించారు. తప్పులు చేసేవారికి శిక్షలు తప్పవని, ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాగా తిమ్మందొడ్డి గ్రామంలో 340 కుటుంబాల్లో ఒక్క కుటుంబం కూడా వంద రోజులు పని కల్పించకపోవడం, అదే విధంగా కొన్ని గ్రామాల్లో తక్కువ సంఖ్యలో వంద రోజులు పనిచేసిన కుటుంబాలు ఉండడంపై పీడీ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ బొంతల మునెప్ప మాట్లాడుతూ.. మండలం అభివృద్ధి చెందేలా పనులను చేపట్టాలని అన్నారు.

తనిఖీల్లో బయటపడ్డ అవకతవకలు

మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ పనులపై ఎస్ఆర్పీ వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో 10 మంది డీఆర్పీలు గ్రామాల్లో 18వ విడత సామాజిక తనిఖీలను నిర్వహించారు. మండలంలో 984 ఉపాధిహామీ పనులకు రూ.12,81,64,216, అదేవిధంగా 83 పంచాయతీరాజ్ పనులకు రూ.2,38,24,181లు, ఆర్‌డబ్ల్యూఎస్ రెండు పనులకు రూ.3,68,557 ఖర్చు కాగా, మొత్తం 1,069 పనులకు రూ.15,23,56,954 ఖర్చులపై తనిఖీ చేపట్టినట్లు ఎస్ఆర్పీ తెలిపారు. అన్ని పంచాయతీల్లో తప్పులపై రూ.1,87,811, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై రూ.1,70,500 జరిమానాతో కలిపి మొత్తం రూ.3,58,311 అవకతవకలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో అత్యధికంగా చేపట్టిన 166 పనులు, ఖర్చు అయిన రూ.3,76,99,979లపై తనిఖీలో అదే స్థాయిలో రూ.1,87,696 రికవరీతో పోలకల్ ప్రత్యేకంగా నిలిచింది. గ్రామంలో ఒక కుటుంబానికి ఎక్కువ సంఖ్యలో జాబ్‌కార్డుల జారీ, పనులకు వెళ్లని వారికి వేతనాలు చెల్లింపులు, కొలతల్లో తేడాలు, కూలీలకు బదులు కుటుంబ సభ్యులకు పనులు కల్పించడం వంటి అంశాలపై పెద్ద ఎత్తున పోలకల్ గ్రామ ఉపాధిహామీ అధికారులు, సిబ్బందిపై అధికారులు రూ.3.76 లక్షల జరిమానా విధించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సి.బెళగల్‌లో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్‌లో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఇతర మండల అధికారులు, సర్పంచ్ పాండురంగన్న తదితరులు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పొదుపు మహిళలతో సమావేశమై పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పొదుపు సంఘాల మహిళలు మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, ఆరోగ్యంపై అధికారులు ప్రసంగించారు. అనంతరం ప్రధాన రహదారులపై చెత్తను తొలగించారు. సర్పంచ్ పాండురంగన్న చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ, ఈఓఆర్డీ పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువని, అందరూ శుభ్రతపై జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆఫీస్ సబార్డినేటర్‌కు ఫిట్స్

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రఘువరన్ ఫిట్స్ (మూర్ఛ వ్యాధి)తో కిందపడిపోయాడు. శనివారం విధులకు హాజరైన ఆయన, మధ్యాహ్న భోజనం అనంతరం కార్యాలయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రఘువరన్‌కు సపర్యలు చేసి స్థానిక వైద్యులతో చికిత్స చేయించారు. కాగా రఘువరన్ కొంత కాలంగా పలుమార్లు మూర్ఛ వ్యాధితో ఎక్కడపడితే అక్కడ పడిపోతున్నాడని కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు.